క్లుప్తంగా

64 గ్రామాల తలగ్రామ కాపుగా వాయిల మురళి


వాయిల మురళిని సన్మానిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య

సింగరాయకొండ: మండలంలోని పాకల పోతయ్యగారి పట్టపుపాలెంలో సోమవారం 64 పట్టపుపాలేలకు సంబంధించి తలగ్రామకాపుగా వాయిల మురళి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తలగ్రామ కాపుగా ఎన్నికైన మురళిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం రాము, ప్రళయకావేరి రోశయ్య, కృష్ణారెడ్డి, 64 పట్టపుపాలేలకు చెందిన కాపులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని వర్దినేనివారిపాలెం, పైడిపాడు, నర్సింగోలు, పచ్చవ గ్రామాల్లో ఒక్కో వలంటీర్ పోస్టును భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, జూన్ 3వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పొగాకు కనిష్ట ధర రూ.174

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి ఆలకూరపాడు, జయవరం, పాలేటిపాడు గ్రామాల రైతులు 994 బేళ్లు తీసుకురాగా వాటిలో 972 కొనుగోలయ్యాయి. 22 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.201, కనిష్ట ధర రూ.174, సరాసరి ధర రూ.199.86 పలికింది. వేలంలో మొత్తం 27 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బైకులు ఢీ.. యువకుడికి గాయాలు

కొండపి: స్థానిక తూర్పు బజారులో ఎదురెదురుగా బైకులు ఢీకొనడంతో ఓ యువకుడి తలకు గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొండపి అంబేడ్కర్ నగర్ నుంచి మంచినీటి కోసం ద్విచక్రవాహనం మీద పల్లె హర్ష మరో యువకుడు బయలుదేరారు. అదే సమయంలో అరుంధతి కాలనీ నుంచి యువకులు మంచినీరు కోసం వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైకులు ఢీకొనడంతో పల్లె హర్ష తలకు గాయమైంది. క్షతగాత్రుడిని ఒంగోలులోని వైద్యశాలలో చేర్చారు.

నేడు విజయోత్సవ సంబరాలు

కనిగిరి రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వైఎస్సార్ భవన్‌లో విజయోత్సవ సంబరాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు భారీ కేక్ కటింగ్ జరుగుతుందని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. సోమవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేక్ కటింగ్ అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం, విలేకర్ల సమావేశం, తదనంతరం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, ఏపీ ఎంసీ సభ్యులు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, యక్కంటి శ్రీను, భవనం కృష్ణారెడ్డి, ఖాదర్ బాష, కౌన్సిలర్లు తదితరులున్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్‌సీపీ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబు
- పొన్నలూరులో గడప గడపకు మన ప్రభుత్వం


పొన్నలూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పొన్నలూరులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు 600 అబద్ధపు హామీలను ఇచ్చి ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో నీరు చెట్టు కార్యక్రమం చేపట్టి ప్రజా ధనాన్ని దోచేశారన్నారు. మళ్లీ దొంగ హామీలను ప్రకటిస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మరని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరిస్తారన్నారు. నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని టీడీపీ నాయకులు చూసి ఓర్చుకోలేకపోతున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సైతం ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద ప్రజలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ గొల్లపూడి రవణయ్య, కంచర్ల రవణయ్య, గద్దం ప్రసాద్, మండవ మాధవ, బోడా మల్లికార్జున, పల్లపోతు బాలయ్య, వెంకటేశ్వర్లు, గద్దం వేణు, ముప్పరాజు చెంచయ్య, గడిపూడి వెంకటేశ్వర్లు, లింగంగుంట నరసింగరావు, నరాల మోహన్, చుండి ఏసుబాబు, జడ భరత్‌కుమార్, చుండి నవీన్, మెండా శ్రీరాములు పాల్గొన్నారు.

కూలీలపై రైతు దాడి

- పలువురికి తీవ్ర గాయాలు
- ఓగూరు గ్రామంలో ఘటన


దాడిలో గాయపడ్డ ముఠా మేస్త్రి కొండయ్య

కందుకూరు: చేసిన కూలి పనికి డబ్బులు అడిగిన కూలీలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సోమవారం మండలంలోని ఓగూరులో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాయకొండకు చెందిన సంచార జాతులకు చెందిన ఒంటెద్దు కొండయ్య, వెంకమ్మ ఆధ్వర్యంలో దాదాపు ఓ 50 మంది ముఠాగా ఏర్పడి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటారు. ఈ క్రమంలో సోమవారం మండలంలోని ఓగూరులో మిరపకాయలు కోసే పనికి ఈ ముఠా వెళ్లింది. గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన పొలాల్లో మిరపకాయలు కోశారు. వీరిలో అల్లం అయ్యప్ప అనే రైతు పొలంలో కూడా మిరపకాయలు కోశారు. సాయంత్రం పనులు ముగిసిన తరువాత కూలినగదు కోసం కొండయ్య, వెంకమ్మతో పాటు మరికొందరు అయ్యప్ప ఇంటికి వెళ్లారు. అయితే కూలి చెల్లించే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. మిగిలిన రైతులంతా రోజు కూలీ కింద ఒక్కొక్కరికి రూ.350 చెల్లించారని, ఆ విధంగానే కూలీ ఇవ్వాలని అయ్యప్పని కొండయ్య, వెంకమ్మలు కోరారు. అయితే తాను ఇచ్చేది రూ.300 మాత్రమేనని రైతు తేల్చిచెప్పాడు. తాము మాట్లాడింది రూ.350 చొప్పున కూలి మాట్లాడామని ఆ విధంగా ఇవ్వాలని వీరు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఇరువురు మధ్య వాదన పెరిగి రైతు అయ్యప్ప కూలీలపై భౌతిక దాడికి దిగాడు. దాడిలో ముఠా మేస్త్రీలుగా ఉన్న కొండయ్య, వెంకమ్మతో పాటు, సాయి, మహేష్ అనే కూలీలు గాయపడ్డారు. గాయపడ్డ కూలీలు ప్రస్తుతం కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కూలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహభరితంగా ఎడ్ల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండలంలోని అయ్యలూరివారిపల్లిలో ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గ్రామదేవత పోలేరమ్మతల్లి వార్షిక వేడుకలను పురస్కరించుకొని పోటీలు నిర్వహించారు. పోటీల్లో సూర్యాపేటకు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్లు 2400 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.70,116, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎడ్లు 2,209 అడుగులతో ద్వితీయ బహుమతి రూ.50,116, నంద్యాల జిల్లా బల్లాపురానికి చెందిన భూమా గోవర్దన్‌రెడ్డి ఎడ్లు 2,161 అడుగులతో తృతీయ బహుమతి రూ.30,116, వైఎస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం ఆనవారిపల్లి గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 2,100 అడుగులతో నాల్గవ బహుమతి రూ.20,116, టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లు 2,032 అడుగులతో ఐదవ బహుమతి రూ.10,116, అర్ధవీడు మండలం, బోగోలు గ్రామానికి చెందిన వల్లెల కృష్ణారెడ్డి ఎడ్లు 1,650 అడుగులతో ఆరవ స్థానంలో నిలిచి రూ.5,116 సాధించాయి. నరసాపురం గ్రామానికి చెందిన కామిని వెంకటసాయి ప్రతాప్‌రెడ్డి ఎడ్లు 1,350 అడుగులతో ఏడవ స్థానంలో నిలిచాయి. విజేతలకు దాత వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్యాల రమణారెడ్డి, రమణమ్మ దంపతుల సహకారంతో బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పాలుగుళ్ల మోహన్‌రెడ్డి, కవిత దంపతుల సహకారంతో అన్నదానం చేశారు.

వాలీబాల్ చాంపియన్ ట్రోఫీ విజేత సిక్స్ బుల్లెట్స్


టంగుటూరులో జిల్లాల వాలీబాల్ చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న విజేత సిక్స్ బుల్లెట్స్ జట్టు

టంగుటూరు: టంగుటూరు పురం సెంటర్ ఎలిమెంటరీ స్కూలు ఆవరణలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధి బీఆర్ అంబేడ్కర్ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన సిక్స్ బుల్లెట్స్ టీం మొదటి బహుమతి గెలుచుకుందని ఆర్గనైజింగ్ సభ్యుడు టీ అశోక్‌బాబు తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలను ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ మెన్స్‌వేర్ టీ రామలింగం అందించారు. రెండో బహుమతి నవకాంత్ ఫ్రెండ్స్ ఊళ్లపాలెం వారికి రూ.10 వేలను శ్రీచైతన్య పాఠశాల రమణ ఇచ్చారు. మూడో బహుమతి రూ.7 వేలను నెల్లూరు బ్లూ వింగ్స్ జట్టుకు అమృత డిగ్రీ కాలేజీ జాలిరెడ్డి అందించారు. నాలుగో బహుమతి ఎఫ్ఎస్ కరవది వారికి రూ.5 వేలు వెంకటేశ్వర్లు అందించారు. ధర్మచక్ర ఫౌండేషన్ కప్స్, షీల్డు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, నిర్వాహకులు శశి డీజే కిరణ్, బక్క సుదర్శన్, తుల్లిబిల్లి క్రాంతి, త్రినాథ్, బొల్లా రాజేష్, కాకర్లమూడి కిషోర్, బొల్లా రామకృష్ణ, దామతోటి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలి

కందుకూరు: పట్టణంలో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కొన్నిచోట్ల ఆటో స్టాండ్‌లు ఉన్నా అవి కొందరు ఆక్రమించుకుని ఉన్నారని, దీని వల్ల ఆటోలు నిలిపేందుకు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపితే పోలీసులు చలానాలు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు పి.బాలకోటయ్య, అధ్యక్షుడు కె.మరళీకృష్ణ, కార్యదర్శి వై ఆనందమోహన్, ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.మాల్యాద్రి, అధ్యక్షుడు బి.సుధాకర్, నాయకులు జె.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఒక అర్జీ

హనుమంతునిపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు ఒక అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ ఎస్ హరిబాబు తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ అర్జీ వచ్చిందన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుడ్లూరు: మండలంలోని బసిరెడ్డిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రసేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు శాఖల సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ధరల స్థిరీకరణ నిధి సమావేశం

కందుకూరు: ధరల స్థిరీకరణ నిధి సమావేశం మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరౌతారని, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, రైతులు, వ్యాపారులు పాల్గొనాలని విజ్ఞప్తి కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

పామూరు: మండలంలోని చిలంకూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతా రామ లక్ష్మణ, హనుమంత మూల విగ్రహ ప్రతిష్టలో భాగంగా సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా స్వామివార్ల మూల విగ్రహమూర్తులకు జలాధివాసం, ధాన్యాదివాసం, విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రబాబుకు పేదలంటే చులకన


బైక్ ర్యాలీలో పాల్గొన్న అశోక్‌బాబు, పార్టీ శ్రేణులు

టంగుటూరు: రాష్ట్రంలో పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన ఇంటి స్థలాలను చంద్రబాబు శ్మశాన వాటికలతో పోల్చి దారుణంగా అవమానిండాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో టంగుటూరు నుంచి జరుగుమల్లి మీదుగా పొన్నలూరు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, మేదరమిట్ల భరత్‌రెడ్డి, సర్పంచి ఉప్పలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.3.05 లక్షలు

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి రూ. 3,05,347 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నర్రా నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి దర్శన టిక్కెట్ల ద్వారా రూ. 1,05,090, లడ్డు విక్రయాల ద్వారా రూ.42,080, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానానికి రూ. 77,495, మహాప్రాకార నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.80,232 వచ్చాయన్నారు.

నిర్ధిష్ట గడువు లోగా సమస్యల పరిష్కారం

కందుకూరు: స్పందనకు వచ్చే సమస్యలను నిర్ధిష్ట గడువు లోగా పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఏడు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీటిలో వ్యక్తిగత, ప్రజా సమస్యలున్నాయని చెప్పారు. వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మున్సిపాలిటీ పారిశుధ్యం, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రజలు 9177700267ను సంప్రదించవచ్చన్నారు.

లింగసముద్రం ఎస్సైకు పురస్కారం


ఐజీ చేతులమీదుగా ప్రశంశాపత్రాన్ని అందుకుంటున్న ఎస్సై

లింగసముద్రం: నెల్లూరులోని ఉమేషచంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం జరిగిన క్రైమ్ సమావేశంలో గుంటూరు ఐజీ పోలరాజు చేతులమీదుగా లింగసముద్రం ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు ప్రశంశాపత్రాన్ని అందుకున్నారు. మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలైన జూదం, క్రికెట్ బెట్టింగులు ఇతర కేసుల్లో దర్యాప్తులను త్వరితగతిన పూర్తి చేయడంలో తగిన ప్రతిభ కనబరిచినందుకు ఎస్సైని అభినందించి ఐజీ ప్రశంశాపత్రం అందజేశారు.

స్పీడ్ గన్‌తో ప్రమాదాల నివారణ

టంగుటూరు: స్పీడ్ గన్‌తో ప్రమాదాలు నివారించవచ్చని ఎస్సై ఖాదర్ బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక టోల్ ప్లాజా వద్ద, జాతీయ రహదారిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మెరకు ఎస్సై ఈ చలానా విధించారు. అతి వేగంగా వెళ్తున్న 96 వాహనాలకు రూ.38,400 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

వెలిగండ్ల: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని గన్నవరం, కంకణంపాడు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ టి.సుకుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ"స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు సక్రమంగా అమలు చేయాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. రికార్డులను, బయెమెట్రిక్ హాజరును పరిశీలించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులకు వేలం

కందుకూరు: పాత కూరగాయల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల్లో వ్యాపారం చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ సోమవారం తెలిపారు. కాంప్లెక్స్‌లోని షాపు నంబర్ -1ను ఎస్సీలకు కేటాయించగా, షాపు నంబర్‌లు-2, 3,4,5,6,7,8 లను జనరల్ కేటగిరి కింద ఉన్నాయి. వీటిని అద్దె ప్రాతిపదికన ఈనెల 31వ తేదీ బహిరంగ వేలం ద్వారా కేటాయిస్తామన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు దరావత్తు కింద రూ. 2,00,000 చెల్లించాలన్నారు. బహిరంగ వేలానికి సంబంధించి పూర్తి వివరాలను కార్యాలయంలోని నోటీసు బోర్డులో చూడవచ్చునని, సందేహాల నివృత్తి కోసం రెవెన్యూ సెక్షన్‌లో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టంగుటూరు సీడీపీఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. జరుగుమల్లి మండల ఐకేపీ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన-గ్రామస్థాయి కమిటీల పాత్ర అనే అంశంపై టంగుటూరు, జరుగుమల్లి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కార్యకర్తలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. సూపర్‌వైజర్లు రమాదేవి, విజయలక్ష్మి, న్యాయసేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు రూ.4.64 కోట్లు మంజూరు

మర్రిపూడి: రైతు భరోసా పథకం కింద మండలంలోని 8,431 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.4.64 కోట్లు మంజూరు చేసినట్లు వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ సోమవారం తెలిపారు. మండలంలోని కూచిపూడి సచివాలయంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఏఓ మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నగదును రైతుల బ్యాంక్ ఖాతాల్లో జూన్ ఒకటో తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేస్తారని తెలిపారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకునేందుకు విత్తనాలు అవసరమైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈర్ల చిన బాబు, బి.మణికంఠ, రైతులు పాల్గొన్నారు.